క్లుప్తంగా

అక్రమ షెడ్డు కూల్చివేత



అక్రమ షెడ్డును కూల్చివేస్తున్న సిబ్బంది

మీర్‌పేట: అనుమతి లేకుండా షెడ్ల నిర్మాణం చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ బి.చంద్రశేఖర్ హెచ్చరించారు. కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ మహేష్ ఆధ్వర్యంలో గురువారం సిబ్బంది పోలీసు బందోబస్తు మధ్య మీర్‌పేట నందిహిల్స్‌లోని పందెం కోడి మీట్‌ను కూల్చివేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టవద్దని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు.

పర్యావరణంపై అవశ్యకత



అవగాహన కలిస్తున్న యాజమాన్యం

బడంగ్‌పేట్: లార్డ్స్ ఒలంపియాడ్ పాఠశాలలోని చిన్నారులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. గురువారం పాఠశాల ప్రాంగణంలో చిన్నారులచే మొక్కలు నాటించారు. ఆకుపచ్చ వేషధారణతో చిన్నారులు వచ్చి అలరించారు. చెట్లు తగ్గిపోవడం వల్ల జరుగుతున్న నష్టాలు గురించి వివరించారు. మొక్కలు పెంచి పెద్ద చేసి కాలుష్యాన్ని నివారించాలని కోరారు. విద్యాసంస్థల చైర్మన్ బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్నివీర్ అభ్యర్థులకు శిక్షణ

ఉచిత శిక్షణ

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లోని ఆర్మీ ఫిజి కల్ అకాడమీలో అగ్నివీర్ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ నందు నాయక్ పేర్కొన్నారు. గతంలో ఇక్కడ శిక్షణ పొందిన ఎంతో మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని, ఆర్మీ, ఎస్ఎస్‌సీజీడీ, ఆర్‌పీఎఫ్, ఢిల్లీ పోలీస్, ఎస్ఐ, పీసీలుగా ఎంపికయ్యారని పేర్కొన్నారు. అగ్నివీర్ విద్యార్థులకు 1600 పరుగు కోసం ప్రత్యేకంగా శిక్షణ, ప్రాక్టీస్ ఇక్విప్‌మెంట్స్, ఫుల్ అప్‌బార్ ఏర్పాటు చేశామని, పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులు తమ ఫలితాల షీట్ తీసుకుని చేరవచ్చని తెలిపారు.

కల్వకుర్తి-మాల్ రూట్లో బస్సులు నడపండి

ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు సోషల్ వర్కర్ రవీందర్‌గుప్త వినతి

యాచారం: కల్వకుర్తి డిపో నుంచి మాల్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన సోషల్ వర్కర్ పి.రవీందర్‌గుప్త గురువారం ఫోనులో విజ్ఞప్తి చేశారు. కోవిడ్‌కు ముందు కల్వకుర్తి డిపోకు చెందిన బస్సులను.. కల్వకుర్తి నుంచి ఆమనగల్ వయా.. సరికొండ, నక్కర్తమేడిపల్లి, యాచారం, ఇబ్రహీంపట్నం, హైదరాబాద్ వరకు, అలాగే కల్వకుర్తి నుంచి వయా.. సరికొండ, నక్కర్తమేడిపల్లి, మాల్ వరకు నడిపేవారని తెలిరు. కోవిడ్ అనంతరం ఆయా సర్వీసులను నిలిపివేశారని ఈ విషయమై కల్వకుర్తి డిపో అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా బస్సులు నడపటం లేదని సజ్జనార్ దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా ఇబ్రహీంపట్నం డిపో నుంచి గ్రామీణ ప్రాంతాలకు కోవిడ్ అనంతరం బస్సు సర్వీసులను చాలావరకు బంద్ చేశారని తెలిపారు. అలాగే గ్రామాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు రాకపోవడంతో విద్యార్థులు కిలో మీటర్ల మేర కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. రవీందర్ ఫిర్యాదులను నమోదు చేసుకున్న సజ్జనార్.. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి బస్సులు నడిచేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో కొత్త బస్సులను కొనుగోలు చేస్తుందని అనంతరం అన్ని గ్రామాలకు బస్సులు నడిచేలా చూస్తామని సజ్జనార్ హామీ ఇచ్చారని రవీందర్‌గుప్త తెలిపారు.

కేజీబీవీ భవనాన్ని ప్రారంభించండి

కడ్తాల్: మండల కేంద్రంలో నిర్మించిన కేజీబీవీ పాఠశాల నూతన భవనాన్ని త్వరగా ప్రారంభించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు క్యామ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఇరవై రోజులు కావొస్తున్నా నూతన భవనంలో పాఠశాల తరగతులు ప్రారంభించకపోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేశారు. శ్రీకాంత్ మాట్లాడుతూ.. గతేడాది పాఠశాల తరగతులు కొనసాగిన అద్దె భవనంలో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఈ ఏడాది కూడా అద్దె భవనంలోనే తరగతులు నిర్వహిస్తే ఎలా అన్నారు.



ముందుకు వెళ్లలేక అవుట్‌లెట్ ఆగింది ఇక్కడే



దుకాణం ఎదుట నిలిచిన మురుగునీరు

అవుట్‌లెట్ లేక అవస్థ

- ఒకచోట పూర్తిగా పైప్‌లైన్ బ్లాక్
- దుర్గంధం వెదజల్లుతున్న కాలనీలు

మహేశ్వరం: జల్‌పల్లి మున్సిపాలిటీ హెడ్ క్వార్టర్‌గా ఉన్న జల్‌పల్లి గ్రామంలో మురుగునీటి అవుట్‌లెట్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. బస్టాప్ దిగువన ఉన్న వీధుల్లో ఎక్కడ చూసినా మురుగునీరు రోజుల తరబడి నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. ముఖ్యంగా రెండు ప్రాంతాల్లో నెలకొన్న ఈ అవుట్‌లెట్ సమస్య గ్రామస్తులను పట్టి పీడిస్తుంది. ఒకప్పుడు గ్రామంగా సమయంలో ఉన్నా రెండు మూడు దశాబ్దాల క్రితం వేసిన పైప్‌లైన్లనే ఇప్పటికీ కొనసాగిస్తుండడంతోనే సమస్యలకు కారణమని తెలుస్తుంది. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన జల్‌పల్లిలో ప్రస్తుతం పెద్ద ఎత్తున కొత్త కాలనీలు వెలశాయి. అందుకనుగుణంగానే జనాభా కూడా పెరిగింది. ఇలా ఎగువన కొత్తగా వెలసిన కాలనీల్లో భారీ పరిమాణంతో కూడిన పైప్ లైన్లు వేసి దిగువన చిన్న సైజ్‌తో కూడిన పైప్‌లైన్‌కు అనుసంధానం చేయడంతో నీరు ముందుకు వెళ్లలేక తిరిగి వెనక్కి నెట్టుకొస్తుండడంతో వీధులన్నీ మురికి కూపాలుగా మారుతున్నాయి.

హెచ్‌కేజీఎస్ దుకాణం నుంచి..


గ్రామంలోని బస్టాప్ నుంచి పెద్ద సైజ్ పైప్‌లైన్‌ను దిగువన ఉన్న హెచ్‌కేజీఎస్ దుకాణం నుంచి పైప్ లైన్ వరకు తీసుకొచ్చి ఎదురుగా వెళ్లే 30 ఏళ్ల నాటి చిన్న సైజ్ పైప్‌లైన్‌కు కలిపేశారు. దీంతో పాటు మరో రూట్‌లో వాటర్ ట్యాంక్, మజీద్, స్థానిక పాఠశాల ఎదుట నుంచి తీసుకొచ్చిన మరోలైన్‌ను కూడా ఇదే కిరాణ షాప్ వద్దకు తీసుకొచ్చి చిన్న పాటిగా ఉన్న పాత లైన్‌కే కలిపారు. దీంతో ఎగువ నుంచి భారీగా వచ్చిన నీరు ఒక్కసారిగా ఇక్కడ బ్లాక్ అయి వీధుల్లో పూర్తిగా నిండిపోయి పాదచారులు నడిచేందుకు కూడా వీలులేకుండా పోతుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే ఇక్కడ ప్రజావసరాలకు సరిపడా పరిమాణంలో పైప్‌లైన్‌ను వేసి గ్రామానికి మురుగు నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

అడ్డుగా మారిన ప్రైవేట్ స్థలం

గ్రామంలోని శివరామాంజనేయ స్వామి ఆలయ పరిసరాలలో కూడా మరో అవుట్‌లెట్ సమస్య స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తుంది. ఎగువ బస్తీల నుంచి వచ్చిన పైప్‌లైన్‌ను ఆలయ ఎదురుగా ఉన్న వీధి వరకు పైప్‌లైన్‌ను వేసి బ్లాక్ చేశారు. అక్కడే ప్రైవేట్ స్థలం అడ్డంగా మారడంతో లైన్‌ను ముందుకు తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొంది. గతంలో ఎప్పుడో చేసిన వెంచర్లలో ఒకదానికొకటి అనుసంధానంగా రోడ్లు వదలకపోవడంతో ప్రస్తుతం ఇక్కడి ప్రజలకు శాపంగా మారింది. దాదాపు 20 గజాల స్థలం వరకు స్థానికులు కొనుగోలు చేసినట్లయితేనే ఈ సమస్యకు పరిష్కారం లభించనుంది. గట్టి ప్రయత్నాలు జరగకపోవడంతో మురుగునీరంతా ఆలయ పరిసర వీధులను ముంచెత్తుతుంది. దీంతో భక్తులు ఆలయానికి కూడా వెళ్లలేక ఆవేదనకు గురవుతున్నారు.



ఆలయ పరిసర వీధిలో నిలిచిన మురుగునీరు



కలుషితమైన బోరు నీరు

కొత్త పైప్‌లైన్ వేయాలి



జల్‌పల్లి గ్రామంలో ప్రస్తుతం మురుగునీటి సమస్య స్థానికులను కలవరపెడుతోంది. పెరిగిన జనాభాకనుగుణంగా కొత్త పైప్‌లైన్లను వేయాలి. మున్సిపాలిటీ కార్యాలయం ఉన్న ఈ గ్రామంలో ఈ సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మురుగు సమస్య కారణంగా విషజ్వరాల ప్రబలే అవకాశం ఉంది.

– ఎం.శ్రీకాంత్‌గౌడ్, జల్‌పల్లి

బోరునీరు కూడా కలుషితమయింది



మురుగునీరు నిత్యం రోడ్లపై నిలిచిపోతుండడంతో బోరు నీరు కూడా కలుషితమయ్యింది. మొత్తం నురుగలతో పచ్చగా దుర్వాసనతో కూడిన నీరు వస్తుంది. ప్రైవేట్ స్థలం అడ్డంగా మారిందని అధికారులు పైప్‌లైన్‌ను ముందుకు తీసుకెళ్లడానికి వెనుకంజ వేస్తున్నారు. ఆ స్థలానికి ఖర్చు భరించేందుకు స్థానికలందరూ సిద్ధంగానే ఉన్నారు. సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే పైప్‌లైన్‌ను వేయాలి.

– శాంతమ్మ, జల్‌పల్లి

మురుగునీరంతా మా ఇంట్లోకే వస్తుంది



వర్షం వచ్చిందంటే ఎగువ బస్తీల్లోని మురుగునీరంతా వర్షపు నీటితో కలిసి సీసీ రోడ్డు పైనుంచి మొత్తం మా ఇంట్లోకి వచ్చి చేరుతోంది. దీంతో ఇంట్లో ఉండలేని పరిస్థితి. పైప్‌లైన్ చివరకు ఆపేసింది మా ఇంటి వద్దే కావడంతో కంపు భరించలేక పోతున్నాం. సీసీ రోడ్డు వేసిన సమయంలో వర్షపు నీరు దిగువన ఉన్న ఇళ్లల్లోకి వెళ్లకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందించాలి.

– డాక్టర్ పండరీ, జల్‌పల్లి

దరఖాస్తుల ఆహ్వానం

యాచారం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు గాను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని యాచారంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ యాదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 12 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా గురుకులాల్లో ప్రవేశం పొంది బదిలీ కోసం ప్రయత్నం చేసే విద్యార్థులు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దాతలు సహకరిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంల పరిధిలోని ఎల్మినేడులో మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు సొంత ఖర్చుతో గురువారం నోట్‌బుక్స్‌ను ఆయన అందజేశారు. అవకాశాలను అందిపుచ్చుకోని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోపాల్, కరుణాకర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పిట్టల యాదగిరి, స్వామి, జంగయ్య, మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

యాచారం: సాగర్ రోడ్డుపై తక్కళ్లపల్లి తండా వద్ద ఉన్న శ్రీ బంగారు మైసమ్మ తల్లి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మొదటిరోజు ఆలయ నిర్మాణ దాత, పర్వతారోహకుడు అంగోత్ తుకారాం, మానస దంపతులు పూజలు నిర్వహించారు. నాలుగు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో శ్రీశైలం పుణ్యక్షేత్రం నుంచి ప్రధాన పూజారులు పాల్గొననున్నారు. శుక్రవారం ఉదయం శ్రీ హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామిజీ హాజరుకానున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.



మైసమ్మ తల్లికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు



బడంగ్‌పేట చౌరస్తాలో ట్రాఫిక్ జాం అయిన దృశ్యం

బడంగ్‌పేట్‌లో ట్రాఫిక్ జాం

గంటపాటు నిలిచిన వాహనాలు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట చౌరస్తా (పాత గ్రామ పంచాయతీ కూడలి)లో ఉదయం సమయంలో నిత్యం ట్రాఫిక్ జాంతో వాహనదారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. గురువారం ఉదయం గంట పాటు ట్రాఫిక్ జాం అయింది. స్కూల్ బస్సులు, బైకులపై స్కూళ్లకు తీసుకెళ్తున్న తల్లిదండ్రులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ టూ ఆదిబట్ల వరకు, అక్కడి నుంచి ఇబ్రాహీంపట్నం, అలాగే ఔటర్ రింగురోడ్డుకు, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లేందుకు ఇదే రోడ్డు కావడంతో ఉదయం 7.30 నుంచి 9 వరకు రోడ్డు బిజీగా ఉంటుంది. నాదర్‌గుల్ మీదిగా ఆదిబట్ల వరకు సుమారు వేయికి పైగా బస్సులు వెళ్తుంటాయి. ఇవిగాక బైకులు, భారీ వాహనాలు, లారీలు, టిప్పర్లు అటువైపుగా వెళ్తుంటాయి. నాదర్‌గుల్ నుంచి బాలాపూర్ చౌరస్తాకు, బడంగ్‌పేట్ చౌరస్తాలోనే ప్రభుత్వ పాఠశాల ఉండటం, ఆర్టీసీ బస్‌లు అక్కడే ఆగుతుంటాయి. దీంతో గంటన్నర పాటు చౌరస్తాలో ట్రాఫిక్ జాం అవుతుంది. నిత్యం ఇదే తంతు కొనసాగుతోంది. నలువైపుల నుంచి వచ్చిన వాహనాలు ఒక్కసారిగా ఇరుకుగా ఉన్న చౌరస్తాలోకి వస్తున్నాయి. ఒక్కసారికే వాహనం టర్న్ కాకపోవడంతో సమస్య జటిలమవుతోంది.

ట్రాఫిక్ పోలీసులను నియమించాలి

ఉదయం ఉ.7.30 నుంచి 9 గంటల వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుందని వాహనదారులు చెబుతున్నారు. ఇద్దరు లేదా ముగ్గురు ట్రాఫిక్ పోలీసులను నియమిస్తే సమస్యకు చెక్ పెట్టవచ్చు. లేదా సిగ్నలింగ్ ఏర్పాటు చేస్తే మరి మంచిదని ప్రజలు భావిస్తున్నారు. ఈ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ బాక్స్‌ను ఏర్పాటు చేశారే తప్ప ట్రాఫిక్ పోలీసులను నియమించక పోవడంతో ట్రాఫిక్‌జాం పెరగడానికి కారణమవుతోందని స్థానికులు చర్చించుకుంటున్నా రు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కారించాలని ప్రజలు కోరుతున్నారు.

అండర్‌పాస్ వద్దు.. ఫ్లైఓవర్ ముద్దు

వనస్థలిపురం: వనస్థలిపురం పనామా చౌరస్తాలో అండర్‌పాస్ నిర్మాణానికి బదులుగా ఫ్లైఓవర్‌ను మాత్రమే నిర్మించాలని బీజేపీ హయత్‌నగర్, మన్సూరాబాద్ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, పలువురు నాయకులు పేర్కొన్నారు. అండర్‌పాస్ వద్దని, ఫ్లైఓవర్‌ను మాత్రమే నిర్మించాలని రెండు రోజుల క్రితం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అయినప్పటికీ అండర్‌పాస్ నిర్మాణం పనులు జరుగుతుండటంతో గురువారం వారు పనామా వద్ద మళ్లీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అండర్‌పాస్‌ల వల్ల రోడ్డుకు ఇరువైపులా ఉండే షాపుల వారి వ్యాపారం దెబ్బతిని వారి జీవనోపాధి పోతుందని, యూటర్న్ సమస్యలు వస్తాయని వారు అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే అండర్ పాస్ నిర్మాణాలను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండారి భాస్కర్, కొత్త రవీందర్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, తడకమళ్ల విజయ్‌కుమార్, నూతి శ్రీనివాస్, పారంద మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పనామా చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు

గ్రామాభివృద్ధి పరిశీలన

మహేశ్వరం: మండలంలోని నాగారం, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి శైలజ పర్యటించారు. ఈ సందర్భంగా నాగారం గ్రామ పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రం, నర్సరీ కమ్యూనిటీ ప్లాంటేషన్, నాగిరెడ్డిపల్లిలోని నర్సరీ, కంపోస్ట్ యార్డ్, స్మశాన వాటికలను పరిశీలించారు. అలాగే, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.



నాగారంలో పర్యటిస్తున్న శైలజ

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మేయర్

మీర్‌పేట: పేదింటి ఆడబిడ్డల వివాహాల కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి పథకంతో ఎన్నో కుటుంబాలకు లబ్ధి చేకూరిందని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ అన్నారు. గురువారం మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన 24 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారంతో కార్పొరేషన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేశామని తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేశామన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కమిషనర్ బి.చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ రాంచందర్ పాల్గొన్నారు.

ఆరోగ్యానికి అల్లనేరేడు!


సీజనల్ ఫ్రూట్స్‌కు డిమాండ్

- దివ్య ఔషధంగా పని చేస్తున్న బ్లాక్ బెర్రీ

హుడాకాంప్లెక్స్: వర్షాకాలంలో విరివిగా దొరికే అల్లనేరేడు పండ్లు ఆరోగ్యానికి ఔషధంలా పని చేస్తున్నాయి. మధుమేహాన్ని నియంత్రించడంతో పాటు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. వర్షాకాలంలో వచ్చే వివిధ రకాల ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడుతుండటంతో వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. సరూర్‌నగర్ రైతుబజార్ సహా ప్రధాన రహదారికి ఇరువైపులా వ్యాపారులు పెద్ద ఎత్తున అమ్మకాలు చేపట్టారు.

మార్కెట్‌కు పోటెత్తుతున్న పండ్లు

నేరేడు పండ్లు మార్కెట్‌కు పోటెత్తుతున్నాయి. ప్రధాన మార్కెట్లోనే కాకుండా వ్యాపారులు కాలనీలు, బస్తీలు తిరుగుతూ విక్రయిస్తున్నారు. పుష్కలమైన ఔషధగుణాలు ఉన్న ఈ పండ్లు మార్కెట్‌లో కేజీ రూ.150పైగా పలుకుతుంది. సీనియర్ సిటిజన్లు ఎక్కువగా వీటిని కొనుగోలు చేస్తున్నారు. తమ పిల్లలకు కూడా వీటి రుచిని చూపిస్తున్నారు. ఒగరు, పులుపు, తీపి కలయికలతో కూడిన నేరేడు పండ్లను తినేందుకు పిల్లలు కూడా ఆసక్తి చూపుతున్నారు. కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు లంచ్‌బాక్స్‌లో ఈ పండ్లనే పెట్టి పంపుతుండటం కొసమెరుపు.



ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నా..



నేను గత పదేళ్లుగా మధుమేహంతో బాధపడుతున్నా. మందులు కూడా వాడుతున్నా.. అయినా షుగర్ అదుపులో ఉండటం లేదు. అల్లనేరేడు పండ్లు తినడం, గింజలను పొడి చేసుకుని వేడినీటిలో కలుపుకుని తాగడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఏటా సీజన్ ప్రారంభంలో ఈ పండ్లు కొనుగోలు చేస్తుంటాను. రోజువారీ ఆహారంలో భాగం చేసుకొని తీసుకుంటున్నా.. ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకుంటున్నా.

– వెంకటరమణ, బడంగ్‌పేట్

ఔషధ గుణాలు పుష్కలం



నేరేడు పండ్లు తినడం ద్వారా జీర్ణక్రియ మెరుగుపడుతోంది. ఫలితంగా మలబద్ధకం, గ్యాస్ ట్రబుల్, అజీర్తి వంటి సమస్యలను నుంచి విముక్తి లభిస్తుంది. మధుమేహాన్ని నియంత్రిస్తుండటంతో ఆ బాధితులు వీటి కొనుగోలుకు క్యూ కడుతున్నారు. పండులో పీచు పదార్థం అధికం. ఐరెన్ సంవృద్ధిగా ఉండటంతో ఎర్రరక్త కణాలను పెంచుతుంది. రక్త హీతనను తగ్గిస్తుంది. బరువు తగ్గాలని భావించే వారికి ఈ పండు చిరు తిండిలా పని చేస్తుంది. హిమోగ్లోబిన్ శాతం కూడా పెరుగుతోంది. వీటిని తిన్న వెంటనే మంచినీరు కానీ, పాలు కానీ తాగొద్దు. – డాక్టర్ అమరవాది ప్రభాకరాచారి, సీనియర్ వైద్య నిపుణుడు